క్లుప్తంగా

సి.రాయవరంలో 'పొలంబడి'



సి.రాయవరంలో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త నరసింహారావు

ఏలేశ్వరం: వరిసాగులో చీడ, పీడల నివారణతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం జిల్లా ప్రధాన శాస్త్రవేత్త తెల్లా వెంకటనరసింహారావు అన్నారు. మండలంలోని సి.రాయవరంలో గురువారం ఏటి జ్యోతి ఆధ్వర్యంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సార్వాలో వరి పంట ఆరోగ్యంగా ఉందన్నారు. పంటను అక్కడక్కడా ఎండాకు తెగులు, కాండం తొలుచు పురుగు ఆశించాయన్నారు. తెగుళ్ల నివారణకు రైతులు యాజమన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, పలువులు రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసనలు

ప్రత్తిపాడు: కోర్టులో పిటీషన్లకు రూ.1 స్థానంలో రూ.20 స్టాంపు వేయాలని బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా న్యాయవాదులు గురువారం చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని బార్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య ప్రారంభించారు. న్యాయవాదులు బొంగుకూరి మధుబాబు, పోతుల జోగేష్, పలివెల నాగేంద్ర, చెలంకూరి రామకృష్ణ, బెహరా లక్ష్మీ ప్రసన్న, మాదాల మంజూష, మర్రి రత్నకుమారి తదితరులు కోర్టు విధులను బహిష్కరించి, ధర్నా చేశారు.

దివ్య రథానికి ఘన స్వాగతం

ప్రత్తిపాడు: కిర్లంపూడి సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్యసాయి బాబావారి దివ్య రథయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ దివ్య రథానికి ప్రత్తిపాడులో గురువారం ఘన స్వాగతం లభించింది. గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, పెద్దాపురం జోన్ ఆధ్యాత్మిక విభాగ కో ఆర్డినేటర్ ఒబ్బిలిశెట్టి బద్రీనారాయణ, కిర్లంపూడి, ప్రత్తిపాడు కన్వీనర్లు కొమ్ముల జయబాబు, సూర్యనారాయణ, జగ్గంపేట ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహ సంక్షేమాధికారి జె. సాయిసూర్యలక్ష్మి తదితరులు రథానికి ఘనంగా స్వాగతం పలికారు. భక్తుల భజనలు, కోలాటాల నడుమ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథయాత్ర సాగింది.

ఆదిత్య కళాశాలకు టాప్ ప్లేస్‌మెంట్ అవార్డు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలకు టాప్ ప్లేస్‌మెంట్ అవార్డు లభించినట్టు ఆదిత్య కళాశాలల వైస్ చైర్మన్ ఎన్. సతీష్‌రెడ్డి గురువారం తెలిపారు. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఇటీవల అడ్వాన్సింగ్ అకాడమీ–ఇండస్ట్రీ కొలాబిరేషన్ సదస్సు నిర్వహించారు. 2022–23 విద్యా సంవత్సరానికి గాను జరిగిన ప్రాంగణ నియామకాల్లో రాష్ట్ర స్థాయిలో 170 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు పాల్గొనగా ఆదిత్య కళాశాలకు ఈ అవార్డు దక్కినట్టు వివరించారు. ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ సురేష్ కుమార్, కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సి. నాగరాణి చేతుల మీదుగా ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌టీవీఎస్ కుమార్ అవార్డును అందుకున్నారని చెప్పారు.

నేడు ఏలూరులో గడప గడపకూ...

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరులో శుక్రవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు గురువారం తెలిపారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

మెప్మా మార్ట్ ప్రారంభం

ఏలేశ్వరం: పట్టణంలో ఏర్పాటు చేసిన మెప్మా మార్ట్‌ను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి ప్రారంభించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో మహిళా సంఘాలు తయారు చేసిన అనేక ఉత్పత్తులను మార్టులో అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సత్యవతి మాట్లాడుతూ పలు పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని డ్వాక్రా మహిళలు అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, మెప్మా టీఎంసీ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై భారం పెట్టొద్దు

గోకవరం: స్థానిక వారపు సంతపై ఆధారపడిన చిరు వ్యాపారస్తులపై భారం పెట్టొద్దని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరంలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఏజెన్సీకి ముఖద్వారంగా ఉన్న గోకవరం వారపు సంతకు శతాబ్దాల చరిత్ర ఉందన్నారు. ఈ సంతపై ఆధారపడి అనేక మంది తరతరాలుగా జీవిస్తున్నారని, వేలం పేరుతో వారి పొట్ట కొట్టవద్దన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మంగరౌతు రామకృష్ణ, కన్నబాబు, పాలూరి బోసుబాబు, బత్తుల సత్తిబాబు, పులపర్తి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



వేలంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న ఎంపీపీ పర్వత రాజబాబు



మురారిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



తునిలో పోషకాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి



పంపాదిపేటలో వృద్ధురాలికి మందుల కిట్ అందజేసిన వైస్ ఎంపీపీ గంగబాబు

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



రాజుపాలెంలో మందుల కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



లచ్చిరెడ్డిపాలెంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

కిర్లంపూడి: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని రాజుపాలెంలో గురువారం సర్పంచ్ గోడె పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన ప్రజలను పేరుపేరునా పలకరించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడం, హెల్త్ క్యాంపుల ద్వారా స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు అందించడం, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పోషకాహార కిట్లు, రోగులకు మందుల కిట్లను పంపిణీ చేశారు. వైద్యులు సాయి హేమాంజలి, సంతోష్ వినీల్, జ్యోతిర్మయి, ఆర్.రమేష్‌కుమార్, సాయితేజ 480 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మరో 11 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, వైఎస్సార్ సీపీ నాయకులు గణేషుల రాంబాబు, గణేశుల లచ్చబాబు, జెడ్పీటీసీ సభ్యులు తోట గాంధీ, దోమాల గంగాధర్, జోకా శ్రీను, గణేశుల నాగబాబు, ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ, వైద్య సిబ్బంది డీఎల్ గంగాధర్, వి.జేమ్స్, సూర్యప్రకాష్, తాతారావు అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. మండలంలోని వేలంగిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వైద్య సదుపాయాలను ప్రజల ముంగిటకు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్షను అమలు చేస్తున్నారన్నారు. డాక్టర్లు సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల సుబ్బయ్యమ్మ, జేసీఎస్ అధ్యక్షుడు బుర్ర లచ్చబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు మేకల సత్యనారాయణ, వైద్యులు శెట్టిబత్తుల రాజీవ్, సౌమ్యశ్రీ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

గండేపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు మెరుగైన వైద్యం అందుతోందని ఎంపీడీఓ రామన్, తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని మురారిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు గ్రామంలోని రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి పి.వీరరాఘవ, వైద్య సిబ్బంది, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల చెంతకే వైద్య సేవలు

తుని: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరుగాలం శ్రమించే పేదలకు ఉచిత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక రాజా ఉన్నత పాఠశాలలో పట్టణంలోని 12, 17, 18 వార్డులకు సంబంధించి గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్‌ను పరిశీలించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందుల కిట్లను అందజేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, కమిషనర్ ప్రసాదరాజు, మూడు వార్డులకు చెందిన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సురక్షతో అందరికీ మెరుగైన వైద్యం

రౌతులపూడి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందుతోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్యులు 356 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో ఆరుగురిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కంటి వెలుగులో భాగంగా 100 మందికి కంటి పరీక్షలు చేసి 85 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఏఎంసీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సూరెడ్డి తిరుమలరాయల్‌సాయి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, సర్పంచ్ చిట్రా రమణమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో మరింత చేరువగా వైద్యం

తొండంగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు వైద్యం మరింత చేరువైందని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మండలంలోని పంపాదిపేటలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యులు రోగులకు పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ పసపులేటి సతీష్, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు కొయ్యా మురళి, అంగుళూరి సుశీల, దడాల విజయ్, బూర్తి నాని, బద్ది బుజ్జి, నక్కా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- రాజుపాలెంలో నూతన సచివాలయ భవనం ప్రారంభం



రాజుపాలెంలో సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని రాజుపాలెంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు గణేశుల రాంబాబు, గణేశుల లచ్చబాబుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలు ప్రభుత్వ సేవల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. సచివాలయాలు అందుబాటులోకి వచ్చాక అన్ని సేవలూ గ్రామాల్లోనే అందుతున్నాయన్నారు. అన్ని గ్రామాల్లోనూ రైతు భరోసా, సచివాలయాల భవన నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యులు తోట గాంధీ, సర్పంచ్ గోడే పద్మావతి, జోకా శ్రీను, సూది శ్రీను, గణేశుల అర్జిబాబు, పసుపులేటి కాశీవిశ్వనాథం, డీఈ ఉమాశంకర్, ఏఈ నారాయణరావు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- లచ్చిరెడ్డిపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం



లచ్చిరెడ్డిపాలెంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

రౌతులపూడి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల రూపంలో గత నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులు డ్రైన్లు, రోడ్లు, వీధిలైట్లు, తాగునీరు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సూరెడ్డి సాయి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, సర్పంచ్ చిట్రా రమణమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, పార్టీ నాయకుడు చిట్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా మట్టి–నా దేశంపై అవగాహన ర్యాలీ



జగ్గంపేటలో జాతీయ జెండాలతో నినాదాలు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జగ్గంపేట: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గురువారం జగ్గంపేటలో నా మట్టి–నా దేశం కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం ముఖ్యఅతిథిగా పాల్గొని ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ప్రాముఖ్యతను వివరించారు. మండలంలోని 16 పంచాయతీల నుంచి సేకరించిన మట్టిని కలశాలతో పట్టుకుని ర్యాలీ చేశారు. అనంతరం స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఎంపీడీఓ వసంత్‌కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రత్తిపాడులో 'నా దేశం – నా మట్టి'

ప్రత్తిపాడు: గ్రామంలో శుక్రవారం కాకినాడ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 'నా దేశం – నా మట్టి' కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు గురువారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాలు వరకు నిర్వహించే అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

విద్యార్థులు సమయ పాలన పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

ఏలేశ్వరం: విద్యార్థులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత సూచించారు. ఉన్నతి ప్రోగ్రాంలో భాగంగా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. కళాశాలలో రెండో బ్యాచ్‌కు చెందిన సుమారు 60 మంది విద్యార్థులకు శిక్షణ పూర్తికావడంతో గురువారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ ప్రాంతంలోనైనా స్వేచ్ఛగా జీవించాలంటే ఇంగ్లిషుతో పాటు కమ్యునికేషన్ స్కిల్స్‌లో ప్రావీణ్యం పొందాలన్నారు. క్రమశిక్షణ ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.చిన్నారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రయాగమూర్తి, ట్రైనర్ కె.దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న అరెస్టు

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాల నుంచి ములగపూడికి మోటారు సైకిల్‌పై సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు గురువారం తుని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడి నుంచి 40 లీటర్ల సారా, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజుకు స్వాగతం

ప్రత్తిపాడు: తుని వెళ్తున్న కేంద్ర మాజీ మంత్రి మంగపతి పల్లంరాజుకు గురువారం ప్రత్తిపాడులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. అనంతరం స్థానిక అభయ దుర్గాదేవి ఆలయంలో మాజీ ఎంపీ పల్లంరాజు పూజలు చేశారు. కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్లిపూడి రాంబాబు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, పార్టీ నాయకులు దాసరి సత్తిబాబు, కందిమళ్ల సామ్యేలు, ఇల్లింకల వీరబాబు, ఈరుగుల చక్రం తదితరులు పాల్గొన్నారు.

మహాచండీదేవిగా కనకదుర్గమ్మ



రత్నగిరిపై శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన వనదుర్గమ్మ



మహాచండీదేవి అలంకారంలో గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ



గోపాలపట్నంలో మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన నేరేళ్లమ్మ అమ్మవారు



వీరభద్రునిగడ్డలో గాజుల అలంకారంలో కనకదుర్గమ్మ



తపోవనంలో రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి

గోకవరం: మండల వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం గోకవరం దేవీచౌక్ ఆలయంలో కనకదుర్గమ్మ మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వీరభద్రునిగడ్డలోని కనకదుర్గమ్మ సైతం మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. దేవీచౌక్, వీరభద్రునిగడ్డ ఆలయాలను మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దర్శించుకున్నారు. స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి 108 రకాల ప్రసాదాలను నివేదించారు.

మహాలక్ష్మీదేవిగా గోపాలపట్నం నేరేళ్లమ్మ

తొండంగి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గోపాలపట్నం నేరేళ్లమ్మ అమ్మవారు గురువారం మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించారు.

రాజరాజేశ్వరీదేవికి లలితా యాగం

తుని రూరల్: శరన్నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి గురువారం లలితా యాగం నిర్వహించారు. పంచమి సందర్భంగా పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి జగదాంబ క్రమ కుంకుమార్చన, విశేష పూజలు, గోపూజ నిర్వహించారు. వేదపండితులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు. కొత్త సూరవరంలో కనకదుర్గమ్మ అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

చండీదేవిగా బాలాత్రిపురసుందరి

గండేపల్లి: దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం తాళ్లూరులోని బాలాత్రిపురసుందరి అమ్మవారు చండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు.

అన్నవరం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అన్నదానం

ఏలేశ్వరం: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద గురువారం అన్నదానం నిర్వహించారు. పట్టణానికి చెందిన సామంతుల సత్యనారాయణ, వెంకటరమణమ్మ దంపతుల ఆర్థిక సాయంతో సుమారు 500 మందికి అన్నదానం చేశారు. తొలుత సాయి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సామంతుల రామన్న, మూది నారాయణ స్వామి, జువ్విన వీర్రాజు, జువ్విన వీర్రాఘవమ్మ, అడపా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



తునిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి, నాయకులు

తుని: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 25 వార్డులో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ యవజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ చైర్మన్ పామర్తి మహేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, కౌన్సిలర్ కాసే సుమతి, కోలా శ్రీను పాల్గొన్నారు.

రహదారికి అడ్డంగా కంచె

శంఖవరం: మండలంలోని వజ్రకూటంలో పరిశ్రమ నిమిత్తం నిర్మించిన రహదారికి అడ్డంగా స్థానిక రైతులు కంచె వేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమకు ఎటువంటి సమాచారం లేకుండా పరిశ్రమ నిమిత్తం రహదారి నిర్మించడం అన్యాయమన్నారు. రహదారి నిమిత్తం తమ భూమిని అక్రమించి మట్టి, చెట్లను తొలగించారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

రేపు మండల సమావేశం

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.పద్మజ్యోతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

బాధిత కుటుంబానికి డి.పట్టా అందజేత

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాలలో గతేడాది క్వారీ బ్లాస్టింగ్ జరిగి అదే గ్రామానికి చెందిన పోలోజు వరహాలు, పోలోజు లక్ష్మీదుర్గాభవాని మృతి చెందారు. కాగా మృతుల కుటుంబ సభ్యులకు గురువారం రెండెకరాల భూమికి సంబంధించిన డి.పట్టాను డిప్యూటీ తహసీల్దార్ పీవీవీ సత్యనారాయణ అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలోని ఊరకొండ సమీపంలో బాధిత కుటుంబీకులు సాగు చేసుకునేందుకు ఈ పట్టాను అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ షేక్ బాబ్జి పాల్గొన్నారు.